ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 30 జూలై 2024

అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామం 8
గురుకులంలో మౌలిక వసతులు కల్పించాలి 8



రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జిల్లా యంత్రాంగం అప్రమత్తం



మురుగు నీటి కాలువను పరిశీలిస్తున్న అధికారులు

- రోజురోజుకు పెరుగుతున్న జ్వరాలు
- నెల రోజుల్లో 76 డెంగీ కేసులు
- దోమల నియంత్రణ చర్యలపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి

జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వానాకాలం... సీజనల్ వ్యాధులకు అనువైన కాలం.. జిల్లాలో ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు ఎక్కడిక్కడ నీటి నిల్వలు ఏర్పడ్డాయి. ఇందులో దోమలు వృద్ధి చెంది...విష జ్వరాలు వ్యాప్తికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. సాధారణ వ్యాధులతో పాటు డెంగీ భూతం భయపెడుతోంది. రోజురోజుకు డెంగీ కేసులు పెరుగుతుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపడుతోంది. జిల్లాలో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. వర్షాలు కురిసిన తర్వాత నీరు నిల్వ ఉండటంతో వ్యాధుల విజృంభణకు ఆస్కారం ఏర్పడుతోంది.

జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలలో ఉన్న వైద్య విధానపరిషత్ ఆసుపత్రులతో పాటు ఆయా మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు అధిక సంఖ్యలో రోగులు ఏ లక్షణాలతో వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రోజురోజుకు డెంగీ కేసులతో పాటు సాధారణ జ్వరాలు సోకిన వారి సంఖ్య ఎక్కువ అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నెలరోజుల వ్యవధిలో సుమారు 76 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయని ప్రభుత్వ వైద్య గణాంకాలు స్పష్టం చేస్తుండగా ప్రైవేటు ఆసుపత్రుల్లో వీటి సంఖ్య లెక్కలేకుండా పోయింది.

పత్తా లేని రోజువారీ నివేదికలు...

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజువారీగా చేసిన చికిత్సలు, పరీక్షలు, రోగుల సంఖ్య, ఇతర వివరాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక అందించాల్సి ఉంటుంది. దీని వల్ల ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎలాంటి కేసులు వస్తున్నాయి... ఎక్కువగా ప్రజలు ఎటువంటి రోగాలతో సతమతమవుతున్నారు అన్న అంచనా వేసే వీలుంటుంది. కాగా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు రోజువారీ నివేదికను నిర్లక్ష్యం చేస్తున్నాయన్న విమర్శలు న్నాయి. జిల్లాలో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్న రోగులను దోపిడీకి గురిచేస్తున్నాయి. వైద్య పరీక్షలు, ల్యాబ్ పరీక్షలు, మందులు తదితర కారణాలతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. దీనికి తోడు పీఎంపీ, ఆర్‌ఎంపీ వ్యవస్థ కమీషన్లకు ఆశపడి ప్రైవేటు, కార్పోరేటు ఆసుపత్రులకు కొమ్ముకాస్తోందన్న విమర్శలున్నాయి.

వారం రోజులుగా అధికంగా డెంగీ కేసులు..

2024 సంవత్సరంలో జూన్ నెల వరకు మూడు కేసులు నమోదు అయ్యాయి. జూలై నెలలో 76 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జూలై నెలలో 2వ తేదీన ఒకటి, 4వ తేదీన ఒకటి, 8వ తేదీన రెండు, 9వ తేదీన రెండు, 10వ తేదీన రెండు, 12వ తేదీన అయిదు, 13వ తేదీన రెండు, 15వ తేదీన ఒకటి, 16వ తేదీన మూడు, 18వ తేదీన ఆరు, 19వ తేదీన నాలుగు, 20వ తేదీన మూడు, 22వ తేదీన ఏడు, 23వ తేదీన అయిదు, 24వ తేదీన పదకొండు, 25వ తేదీన నాలుగు, 26వ తేదీన తొమ్మిది, 27వ తేదీన ఎనిమిది డెంగీ కేసులు నమోదు అయ్యాయి. ప్రధానంగా ఎండపల్లి, బీమారం, సారంగపూర్ మండలం పెంబెట్ల, జగిత్యాల రూరల్ మండలం అంబారిపేట, మల్లాపూర్ మండలం హస్సేన్ నగర్, మేడిపల్లి మండలం కట్లకుంట, మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీ, కోరుట్ల పట్టణ శివారులోని అల్లమయ్య గుట్ట తదితర ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.

జాగ్రత్తలు తప్పనిసరి....

- చీకటి పడేముందు ఇంటి తలుపులు, కిటికీలు మూసేస్తే దోమలు ఇంట్లోకి రాకుండా నివారించవచ్చు.
- నీటి ట్యాంకులు, సంపులు, పాత్రలపై మూతలు ఏర్పాటు చేయాలి.
- ఇళ్లలోని పూల కుండీలు, కూలర్లు, టైర్లు, పాడైన వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- బయటి ఆహారం తీసుకోవద్దు. ప్రతీసారి చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- దోమ తెరలు వినియోగించాలి.
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ పోయాలి. ఆయిల్ బాల్స్ వేయాలి.
- పగటి పూట దోమ కుట్టకుండా అప్రమత్తంగా ఉండాలి.

పరిశుభ్రతతోనే సమస్య పరిష్కారం...

డెంగీ రావడానికి ప్రధాన కారణమైన దోమల నియంత్రణ జరగడం లేదు. పట్టణాలు, ప్రతీ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడితే సమస్యను అధిగమించే వీలుందని నిపుణులు సూచిస్తు న్నారు. ఆ దిశగా నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాల ద్వారా శాశ్వత చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముక్కు కారడం, జలుబు, దగ్గు, ఆయాసం ప్రధాన లక్షణాలుగా ఉంటాయి. ఈ సీజన్‌లో జలుబు, దగ్గు లక్షణాలు ఉంటే ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. లేదంటే ఇతరులకు సంక్రమించే అవకాశం ఉందనే విషయాన్ని గ్రహించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. డెంగీ జ్వరం తొలుత సాధారణంగా ఉన్నా మూడు నుంచి 14 రోజుల్లో లక్షణాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతుల, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు తదితర లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు అంటున్నారు.

ఆచరణతోనే ఆరోగ్యం...

డెంగీ జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. పళ్లరసాలు, కొబ్బరి నీళ్లలో గ్లూకోజ్ కలుపుకొని తాగాలి. వీలైనంత విశ్రాంతి తీసుకోవాలి. రాత్రి పూట నిద్ర పోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో దోమలను పారదోలే రసాయనాలు వినియోగించాలి. శరీరంలో ప్లేట్ లెట్స్ 30 వేల కన్నా తగ్గినప్పుడే రోగికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. తీవ్ర రక్త స్రావం, శరీరంలో ఆయా భాగాలు సక్రమంగా స్పందించకపోవడం వంటి లక్షణాలు వెలుగు చూస్తాయి. ఇలాంటి సందర్భాల్లో రోగిని ఐసీయూలో చేర్చాల్సి వస్తుంది. రక్తనాళాల ద్వారా ప్లేట్‌లెట్స్ శరీరంలోకి వైద్యులు పంపిస్తారు. 50 వేలకు పైబడి ప్లేటెట్స్ నిర్ధారణ అయితేనే రోగి ఆరోగ్యం మెరుగైన స్థితికి చేరకుంటుందని వైద్య అధికారులు అంటున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

- డాక్టర్ సమీయొద్దీన్, డీఎంహెచ్‌వో, జగిత్యాల



జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణతో పాటు డెంగీ కేసులు నమోదు కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటా జ్వర సర్వే చేయిస్తూ జ్వరం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతిరోజు డ్రైడే పాటిస్తూ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

- మంత్రి తుమ్మలను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ కలిసి వినతిపత్రం అందించారు. సోమవారం హైద్రాబాద్‌లోని నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించడంతో పాటు పలు సమస్యలను విన్నవించారు. జగిత్యాల రూ రల్ మండలం లక్ష్మీపూర్‌లో ఏడు కోట్ల రూపాయల నిధులతో సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ మంజూరు కాగా ఇప్పటివరకు సుమారు 70 శాతం పనులు పూర్త య్యాయన్నారు. మరో రూ. 3.50 కోట్లు నిధులు ఎస్‌డీఎఫ్ నుంచి కేటాయించి నప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిందని వివరించారు. సంబంధిత రూ. 3.50 కోట్లు, కార్పొరేషన్ గ్రాంట్ నుంచి రూ. 1.24 కోట్లు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. తద్వారా షెడ్డు పనులు, యంత్రాల ఏర్పాటు పనులు త్వరగా పూర్తవుతాయని, ఎంతోమంది రైతులకు ప్రయోజన కరంగా ఉంటుందని తెలిపారు. ఇందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ తెలిపారు.

చెత్త తరలించే వాహనాలపై శ్రద్ధ వహించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల టౌన్, జూలై 29: చెత్త తరలించే వాహనాలను తమ సొంత వాహనాలుగా భావించి ప్రత్యేక శ్రద్ధ వహించేలా పారిశుధ్య కార్మికులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, వాటర్ ట్యాంక్ ఏరియా ప్రాంతాల్లో పారిశధ్య పనులను చైర్‌పర్సన్ పరిశీలించారు. సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ సమ్మయ్య, ఏఈఈ చరణ్ తదితరులు ఉన్నారు.

పీఎం విశ్వకర్మ సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి

కొడిమ్యాల, జూలై 29: పీఎం విశ్వకర్మ సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలని ఆర్‌టీఐ అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడిమ్యాల మండలంలో పీఎం విశ్వకర్మ యోజనలో మండలం నుంచి సుమారు 200 మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. సమాచారం కోసం ఎవ్వరిని ఎక్కడ సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొంత మందికి ట్రైనింగ్‌కు సమాచారం వచ్చిందన్నారు. మరికొంత మందికి సమాచారం రాకపోవటంతో ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో పీఎం విశ్వకర్మ సమాచార కేంద్రం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సెల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేక టీం ఏర్పాటు

- ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 29: జిల్లాలో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి సెల్ ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత సంవత్సరం పోలీస్ శాఖ ప్రారంభించిన పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 411 మంది బాధితులకు ఫోన్లు రికవరీ చేసి ఇచ్చామన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్లుకున్నా, చోరీకి గురైనా తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రజలకు సీఈఐఆర్ పోర్టల్‌పై పోలీస్ అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో చైర్మన్



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, జూలై 29: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి షాక్ తగిలింది. భీమారం సింగిల్ విండో చైర్మన్ కాసుగంటి శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

చెరువులకు జలకళ: పారుతున్న వాగులు





మత్తడి దూకుతున్న పోతారం చెరువు, మహాసముద్రం చెరువు



ప్రవహిస్తున్న కొడిమ్యాల వాగు

కొడిమ్యాల, జూలై 29: మండలంలో పదిరోజులుగా కురుస్తున్న వర్షంతో వివిధ గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని పోతారం పెద్ద చెరువు, కొడిమ్యాల మహాసముద్రం చెరువు, కోనాపూర్ బంజేరుచెరువు, శంఖుని చెరువులు, కొన్ని కుంటలు నిండి జలకళను సంతరించుకున్నాయి. నీటితో నిండిన పోతారం చెరువు వారం రోజులుగా మత్తడి దూకుతోంది. కొడిమ్యాల వాగు పారుతోంది. వాగు పారటంతో పోతారం చెరువు ప్రాంతం నుంచి వాగుకి ఇరువైపుల గల వ్యవసాయ బావుల్లో, బోరుబావుల్లో నీటి మట్టం పెరుతుందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలి

మల్యాల, జూలై 29: గ్రామ పంచాయితీ సిబ్బందికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని పంచాయితీ సిబ్బంది డిమాండ్ చేశారు. హామీల అమలుకు జూలై 30న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన నోటీస్‌ను ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, కారోబార్, బిల్ కలెక్టర్, గుమస్తాలను సహాయ కార్యదర్శులుగా నియమించాలని అన్నారు. అలాగే పంచాయితీ సిబ్బందిని పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నాలో పెద్ద ఎత్తున గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపినిచ్చారు.

ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేయండి

ధర్మపురి, జూలై 29: రైతుల పంట పొలాలకు ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా నీరు విడుదల చేయాలని ధర్మపురి మండల రైతు బంధు మండల అధ్యక్షుడు సౌళ్ల భీమయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత వర్షకాలంలో తక్కువ శాతం వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, బావుల్లో సరిగా నీరుచేరలేదని ఆయన పేర్కొన్నారు. రైతులు వానాకాలంలో తమ పంట పొలాల్లో నారు వేస్తున్నారని ఆయన తెలిపారు. ఎస్సారెస్పీలో 30 టీఎంసీల నీరు ఉన్న కాలంలో అధికారులు కాలువల ద్వారా నీరు విడుదల చేసినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ఎస్‌ఆర్‌ఎస్‌పీలో 35 టీఎంసీల వరకు నీరు ఉండటం వల్ల వెంటనే కాలువల ద్వారా నీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి వేయించాలని ఆయన కోరారు.

మాదిగలకు ఇచ్చిన మాట ప్రధాని నిలబెట్టుకోవాలి

ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేష్

జగిత్యాల అర్బన్, జూలై 29: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, ఈ పార్లమెంట్ సమావేశాల్లో అయిన వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు దేశ ప్రధాని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆగష్టు 6న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన ఛలో ఢిల్లీ దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కార్యక్రమ కరపత్రాన్ని పట్టణంలోని స్థానిక గాంధీనగర్‌లో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి మాదిగ, ఉపకులాలకు న్యాయం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక మాదిగ జాతిని విస్మరించడం సరికాదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆకాంక్షల సాధనకోసం తలపెట్టిన దీక్షకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మాదిగ, మాదిగ ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మేకల పవన్, బొల్లారపు సూరి, బొల్లారపు రమేష్, గొల్లపెల్లి రవికుమార్, ఉప్పరపు చరణ్, నక్క చరణ్, శ్రీకాంత్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



ఛలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, జూలై 29: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నేరెళ్ల ప్రదీప్‌కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

● ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి క్షేత్రంలో సోమవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సెలవు దినం కావటం వల్ల లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమ ధర్మరాజు ఆలయాన్ని అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

జమ్మికుంట రూరల్, జూలై29: మోత్కులగూడెంకు చెందిన మనోజ్ కుమార్ నాలుగు రోజుల క్రితం అదృశ్యం అయ్యాడని భార్య లావణ్య పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోజ్‌కుమార్ ఈ నెల 26న పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పాడు. బయటకు వెళ్లి తిరిగా రాలేదు. మూడు రోజులుగా ఆచూకీ లేక పోవడంతో భార్య ఫిర్యాదు చేసిందని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య



సత్తయ్య(ఫైల్)

కోనరావుపేట, జూలై 29: ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నా డు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి సత్తయ్య(40) అనే వ్యవసాయ కూలీ కూలి పనులతోపాటు భూమి కౌ లుకు తీసుకొని సాగు చేసే వాడు. వ్యవసాయంలో దిగుబడి తగ్గి నష్టం రావడంతో గతంలో రెండు సార్లు పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు యత్నించాడు. మరోసారి గొంతు కోసుకున్నాడు. మూడుసార్లు ఆత్మహత్యకు యత్నించగా చికిత్సకైన ఖర్చులతోపాటు వ్యవసాయంలో వచ్చిన నష్టంతో రూ.10 లక్షల వరకు అప్పు పేరుకుపోయింది. దీంతో ఆవేదనకు గురైన సత్తయ్య ఆదివారం సాయంత్రం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పురుగుమందు తాగానని చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకొని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

శంకరపట్నం, జూలై 29: మండలంలోని గొల్లపల్లి శివారులో కరీంపేటకు చెందిన వ్యాపారి చేపట్టిన నిర్మాణానికి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోర గణేశ్ ఆరోపించారు. సోమవారం నిర్మాణం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంపేటకు చెందిన ఓ వ్యాపారి ఇల్లు నిర్మిస్తున్నాడని చెప్పారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న వ్యాపారిపై శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ మట్టి తరలింపు వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య



లక్ష్మి, రాజేశం(ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూలై 29: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దారు ణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన దూస లక్ష్మి (50)ని ఆమె భర్త దూస రాజేశం (55) రాడ్డుతో కొట్టి చంపి అనంతరం ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం... శాంతినగర్‌కు చెందిన దూస లక్ష్మి, రాజేశం దంపతులు పవర్‌లూంలు నెలకొల్పి జీవనం సాగిస్తున్నారు.. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కు మార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం రాజేశంకు రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చేయించు కుంటున్నాడు. సర్జరీ చేసి కిడ్నీలు మార్పిడి చేయించాలని రాజేశం కొద్ది రోజులుగా కోరుతున్నాడు. ఈ విషయంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి గొడవ తలెత్తి క్షణికావేశంలో రాజేశం భార్య లక్ష్మిని రాడ్డుతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం రాజేశం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఎన్టీపీసీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

జ్యోతినగర్, జూలై 29: రామగుండం ఎన్టీపీసీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి సోమ వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రామగుండం ఎన్టీపీసీలో వర్క్‌మెన్‌గా పని చేస్తున్న సదరు ఉద్యోగిని 2019లో కేరళలోని కాయంకులం ఎన్టీపీసీకి యాజమాన్యం బదిలీ చేసింది. మొదటిసారి బదిలీ అయినప్పుడు కూడా ఆత్మహత్యాయత్నం చేసుకు న్నాడు. అప్పుడు యాజమాన్యం ఉద్యోగిపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగిని డిప్యూటేషన్‌పై తిరిగి రామగుండం ఎన్టీపీసీకి పంపించారు. అతని డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో తిరిగి డిప్యూటేషన్‌ను కొనసాగించి రామగుండంలోనే పనిచేసేందుకు అనుమతి వ్వాలంటూ చేసిన ప్రయత్నం ఫలించ లేదు. ఈక్రమంలో సోమవారం ఎన్టీపీసీ పరిపాలనా భవ నం(ఏడీఎం బిల్డింగ్) ఆవరణలో నిద్ర మాత్రలు మింగి నట్లు తెలుస్తున్నది. అతడిని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తర లించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. ఎన్టీపీసీ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

మానకొండూర్, జూలై 29: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన గాడిచర్ల తిరుపతిపై హత్యాయత్నం చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గాడిచర్ల సాయికుమార్, అతడి తండ్రి గాడిచర్ల రాజును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్‌కుమార్ తెలిపారు. భూతగాదాలతో ఈ నెల 19నగొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు.

ఒకరిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, జూలై 29: అబాది జమ్మికుం టకు చెందిన నికత్నిస తన భర్త జమీర్ పాషా అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశా రు. జమీర్ పాషా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నా డని ఫిర్యాదు చేసిందని పట్టణ సీఐ రవి తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

వేములవాడ రూరల్, జూలై 29: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని మర్రి పల్లి గ్రామానికి చెందిన తుపాకుల పర్శరాములు (68) సోమ వారం మోటారు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారీ వ్యవసాయబావిలో పడిపోయాడు. తీవ్రగాయాలవడంతో మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు లు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

మెట్‌పల్లి రూరల్, జూలై 29: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలోని హాస్టల్స్‌లో మౌలిక వసతులు కరువయ్యాయని, శిథిల భవనాల్లో విద్యార్థులు నలుగుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఎదుట నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన రాజారపు గణాధిత్య అనుమానాస్పదస్థితిలో మరణించడం, అదే రూమ్‌లోని రాపర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ పాము కరవడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందడం బాధకరమని చెప్పారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రాపాక సాయికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మదవేణి సునీల్, నాయకులు మారుతీ, మహాదేవ్, జస్వంత్, అక్షయ్, పవన్, అభి, మణిదీప్, విగ్నేష్, కిరణ్, నితీష్, రాకేష్, మనిష్, నిఖిలేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

▸▸ ఐదు మోటర్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు తరలింపు



గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో మిడ్‌మానేరు రిజర్వాయర్‌కు ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం 18,655 క్యూసెక్కుల వరద నీరు రాగా, సాయంత్రం వరకు 16,081 క్యూసెక్కులకు తగ్గింది. కడెం ప్రాజెక్టు నుంచి 8,170 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 7,911 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నిన్నటి వరకు నంది మేడారం నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసె క్కుల నీటిని తరలించిన ప్రాజెక్టు అధికారులు ఉదయం నుంచి 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌కు, అక్కడినుంచి మిడ్ మానేరు తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, సాయంత్రం 6 గంటల వరకు 17.813 టీఎంసీల నీటి మట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు ఎగువ భాగాన వర్షాలు తగ్గుముఖం పట్టాయి. వరద పెరిగితే మాత్రం మరో రెండు మోటార్లను ప్రారంభిస్తామని నీటి పారుదల అధికారులు చెబుతున్నారు.

● గాయత్రి పంప్ హౌస్ నుంచి ..

రామడుగు: మండలంలో లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం 4 బహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు ఆదివారం వరకు కొనసాగించారు. కాగా సోమవారం నుంచి ఐదు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. రెండు రోజుల పాటు రోజుకు 12,600 క్యూసెక్కుల నీటి విడుదల చేసిన అధికారులు సోమవారం ఐదు పంపులదావ్రా 15,750 నీటిని విడుదల చేశారు. డెలివరి పాయింట్ నుంచి గ్రావిటి కెనాల్‌లోని ఐదు పంపులు, ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం ఉప్పొంగుతూ ప్రవహిస్తోంది. గ్రావిటి కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు చేరుతోంది. కాగా ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా నిండుకుండలా వరద కాలువ ప్రవహిస్తూ ఉండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు పంపుల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు గాయంత్రి పంప్ హౌస్ అదికారులు తెలిపారు.

కోటిలింగాల వద్ద గోదావరిలో పెరుగుతున్న వరద



కోటిలింగాల వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల వరకు చేరిన నీరు

వెల్గటూర్, జూలై 29: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరిలోకి వరద నీరు పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి గోదావరిలోకి చేరుతున్నాయి. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 4,311 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో నీటి మట్టం పెరుగుతోంది. గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో పుష్కర ఘాట్ల వరకు నీరు చేరింది. గోదావరిలో వరద నీరు చేరి నీటి మట్టం పెతుండడంతో గొర్ల కాపర్లు, మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసే భక్తులు లోతు ప్రాంతానికి వెళ్ల వద్దని తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

- ప్రాజెక్టులోకి 17,310 క్యూసెక్కుల నీరు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరదనీరు పెరుగుతోంది. సోమవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 33.857 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 644 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.260 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.463 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వాడారు.

జ్వరాలతో ఇద్దరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలై 29: పెద్దపల్లి జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటలో సాయి సాత్విక్(13) మృతి చెందాడు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న సాయిసాత్విక్‌కు ఆదివారం తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా ఆదివారం రాత్రి మార్గమధ్యలో మృత్యువాత పడినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే ఓదెల మండలం ఇందుర్తిలో సోమవారం గాదం ప్రతాప్(68) అనే వృద్ధుడు జ్వరంతో మృతి చెందాడు. వారం రోజుల నుంచి జ్వరంతో ప్రతాప్ మంచం పట్టాడని, వైద్యం కోసం జమ్మికుంటకు తరలించేందుకు సిద్ధమవుతుండగా ఇంట్లోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.

జాఫర్ ఖాన్ పేటలో వైద్య శిబిరం



వివ జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

కాల్వశ్రీరాంపూర్, జూలై 29: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో జ్వరాలు రావడంతో సోమవారం ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంను జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు వర్షాకాలంలో ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు, చెత్త ఉండడం వలన దోమలు పెరిగిపోయి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. జ్వరం వచ్చినట్లయితే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 35మంది రక్తనమూనాలు సేకరించారు. 108మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, హెచ్ఈఓ లక్ష్మణ్, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు.

పీఎఫ్‌లో మార్పులుంటే ఈ నామినేషన్‌లో సరిచేసుకోవాలి

- పీఎఫ్, బీమా, పెన్షన్ సమస్యల పరిష్కారానికి కృషి
- రీజినల్ పీఎఫ్ కమిషనర్ తానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్‌సీ తానయ్య

జ్యోతినగర్, జూలై 29: ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) వివరాలలో తేడాలుంటే, మార్పులు, చేర్పులుంటే ఇ నామినేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య సూచించారు. సోమవారం ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసి ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్‌లపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తానయ్య మాట్లాడుతూ ఉద్యోగుల దగ్గరకే ఈపీఎఫ్ఓ కార్యక్రమం ద్వారా పీఎఫ్ సంబంధ సమస్యల పరిష్కారానికి మా వాఖ కృషి చేస్తున్నదన్నారు. కార్మికుల పీఎఫ్ డేటాలో మార్పులు చేసుకోవడానికి గతంలో మ్యాన్యువల్‌గా ప్రక్రియ ఉండేదని ఇప్పుడు ఇ నామినేషన్ అనే ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీపీసీ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ స్కీంకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని, 2014 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగలకు హయ్యర్ పెన్షన్ వర్తింస్తుందన్నారు. అలాగే కార్మికులు పీఎఫ్‌కు సంబంధించి సమస్యలుంటే కరీంనగర్‌లోని రీజినల్ పీఎఫ్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఏజెన్సీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాను ఆర్‌పీఎఫ్ కమిషనర్ తానయ్య నివృత్తి చేశారు. హయ్యర్ పెన్షన్ విషయంలో తాము పీఎఫ్ సంస్థకు చెల్లించే సొమ్మును పంపించినప్పటికీ తమకు చెక్కులు ఎందుకు వాపసు చేశారో చెప్పాలని కొంతమంది మాజీ ఎన్టీపీసీ ఉద్యోగులు రీజినల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ ఈ.కిరణ్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి(పీఎఫ్) వి.వెంకట రమణ, ఎన్టీపీసీ ఏజీఎం సిక్దర్, అధికారు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

317జీవో బాధితుల బదిలీ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్

జగిత్యాల అర్బన్, జూలై 29: జీవో 317 బాధితులకు డీఈవో పూల్‌లో ఉన్న పోస్టుల్లో బదిలీ చేస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీ, పదోన్నతులతో పాటు 10,456 పండిత, పీఈటీ అప్‌గ్రేడేషన్ సమర్థవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) పక్షాన కృతజ్ఞతలు తెలిపా రు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన రాష్ట్రప్రభుత్వం మిగిలిపోయిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బీఈడీ కలిగిన వారికి అర్హత కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, మిగిలిన పండిత పీఈటీల పదోన్నతుల సమస్యలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికీ రిలీవ్‌కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు. జిల్లా బాధ్యులు శేఖర్, శ్రావణ్, రమేశ్, అహ్మదుల్లా ఖాన్, భూమరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

సైబర్ మోసంతో 1.84 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

మెట్‌పల్లి, జూలై 29: మెట్‌పల్లి పట్టణానికి చెందిన జోగ నవీన్ అనే యువకుడు సైబర్ మోసంతో 1.84 లక్షలు పోగొట్టుకున్నట్లు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జోగ నవీన్ క్రెడిట్ కార్డుతో ఓ సంస్థ వెబ్‌సైట్‌లో టీవీని కొనుగులు చేశాడు. టీవీ ప్రాబ్లం రావడంతో దాన్ని రిటర్న్ పంపడానికి ఆన్‌లైన్‌లో సంప్రదించగా వాళ్లు టీవీ కంపెనీ వాళ్లకు అందజేయాలని సూచించారు. దీంతో అన్‌లైన్‌ల్లో కస్టమర్ కేర్ నంబర్ వెతికి దానికి ఫోన్ చేశారు. టీవీ కొనుగోలు చేసిన నంబర్ తెలపాలని అడిగి దానికి ఓ లింక్ పంపాడు. వారు చెప్పిన విధంగా చేశాడు. వెంటనే అకౌంట్‌లో డబ్బులు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే బ్యాంకులోని అధికారులను సంప్రదించగా రూ. 1.84లక్షలు కట్ అయినట్లు తెలిపారు. టీవీ కంపెనీ వారిని సంప్రదించగా మాకు ఎలాంటి డబ్బులు రాలేదని తెలపడంతో మోసపోయానని గుర్తించాడు. వెంటనే అన్‌లైన్‌లో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు జోగ నవీన్ తెలిపారు.

సింగరేణి సీఎండీని కలిసిన తుమ్మేటి సమ్మిరెడ్డి

గోదావరిఖని, జూలై 29: సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీపీసీసీ మీడియా కన్వీనర్ తుమ్మేటి సమ్మిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేసి సీఎండీగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల పిల్లలు నిరుద్యోగులుగా ఉన్నారని, వారిలోని నైపుణ్యం వెలికి తీసేందుకు కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను గోదావరిఖనిలో ఏర్పాటు చేయాలన్నారు. కాలుష్యాన్ని నిర్మూలించడానికి నిత్యం మొక్కలు నాటి పర్యావరణానికి దోహనం చేయాలని, సింగరేణి ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలకు సీఎస్ఆర్ ఫండ్ అందించాలని సీఎండీని కోరారు. సీఎండీని కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్, విజయభాస్కర్, మధుకర్‌రెడ్డి ఉన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా

- పెగడపల్లి మండలంలో ఎస్సారెస్పీ కాలువలు అధ్వానం - పట్టించుకోని అధికారులు



పెగడపల్లి శివారులో ఎస్సారెస్పీ డీ77 కాలువలో పెరిగిన పచ్చి మొక్కలు

పెగడపల్లి, జులై 29: మరమ్మతులు లేక ఎస్సారెస్పీ కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తిస్థాయిలో పండుతాయి. మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏళ్ల క్రితం సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండి పోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాళ్లు కనిపించ కుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి నీరు చేరితే మొదటి పంటకు మరి కొద్ది రోజులలో నీరు వదిలే పరిస్థితు లుండగా కాలువల మరమ్మతు పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపుకు మాత్రం అధికారులు దృష్టిసారించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలలో పిచ్చిమొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్ల వదిలినా సమీప ప్రాం తాల రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోంది. చివరి ఆయకట్టు పంటలకు సాగు నీరు అందకపోవడంతో ఎండి పోతున్నాయి. అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డుపైనే వారసంత

- నిరుపయోగంగా మార్కెట్ భవనం- సమీకృత మార్కెట్‌కు మోక్షం కరువు



రాయికల్‌లో రోడ్డుపై కూరగాయులు విక్రయిస్తున్న వ్యాపారులు

రాయికల్, జూలై 29: రాయికల్ పట్టణంలో వారసంత క్రయ, విక్రయాలు రోడ్డుపైనే జరుగుతున్నాయి. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఇటిక్యాల క్రాసింగ్ రోడ్డు వరకు ప్రతి శనివారం ట్రాఫిక్ జామ్‌తో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, మాంసం విక్రయాల కోసం రూ.42 లక్షల వ్యయంతో మార్కెట్ భవనం నిర్మించినా కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఈ భవనాన్ని వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- మూలుగుతున్న రూ.3 కోట్ల నిధులు

రాయికల్ బల్దియాలోని ప్రజలకు ఒకేచోట అన్ని రకాల కూరగాయలు, మాంసాన్ని విక్రయించేందుకు నాలుగేళ్ల క్రితం టీయూఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ.3 కోట్లతో సమీకృత మార్కెట్‌కు నిధులు మంజూరయ్యాయి. పట్టణ శివారులోని మార్కెట్ యార్డులో 20 గుంటల స్థలాన్ని అప్పటి కలెక్టర్ రవినాయక్ స్థలాన్ని ఎంపిక చేసి టెండర్ చేపట్టారు. పట్టణానికి దూరంగా ఉంటుందని, మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్ నిర్మిస్తే రైతులకు స్థలం సరిపోదనే ఉద్దేశ్యంతో ఆందోళన నిర్వహించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేక పరారయ్యారు.

- స్థలం కోసం అన్వేషణ

రాయికల్ బల్దియాలో సమీకృత మార్కెట్ కోసం మంజూరైన రూ.3 కోట్ల నిధులు మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి చేరనున్నాయి. బల్దియాలో 20 గుంటల స్థలం సైతం లేకపోవడంతో సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించి రాయికల్ పట్టణానికి మంజూరైన సమీకృత మార్కెట్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి



రూ.42 లక్షలతో మార్కెట్ భవనం..

రాయికల్ పట్టణంలో రూ.42 లక్షలతో మార్కెట్ భవనం నిర్మించాం. కూరగాయలు, మాంసం విక్రయదారులు రోడ్డుపైనే విక్రయిస్తుండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. మార్కెట్ భవనంలోనే విక్రయించేలా చూస్తాం.

- మోర హన్మాండ్లు, మున్సిపల్ చైర్మన్



ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి..

రాయికల్ పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.3 కోట్లతో మంజూరైన సమీకృత మార్కెట్ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలకమండలి సభ్యులతో చర్చిస్తాం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం. - చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

పొలాల్లో వలస కూలీలు

- నాటు వేసేందుకు మహారాష్ట్ర నుంచి రాక - రైతులకు తప్పిన ఇబ్బందులు - ఎకరానికి రూ. 5వేలు చెల్లింపు



చెర్లబూత్కూర్‌లో నాటు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

కరీంనగర్ రూరల్, జూలై 29: ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామాల్లో నాటు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు రైతులు పొరుగు రాష్ట్రాల కూలీలను ఆశ్రయిస్తున్నారు. నాట్లు వేయడానికి మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నారు. కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యంగా పడడంతో రైతులు కొంత నిరాశ చెందారు. ఇటీవల వరణుడు కరుణించడంతో వరి నాట్లు లేటవుతాయన్న నేపథ్యంలో మండలంలోని చెర్లబూత్కూర్, ఇరుకుల్ల, దుబ్బపల్లి, చామనపల్లి, నగునూర్ గ్రామాల రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువచ్చారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రాపూర్ జిల్లాల నుంచి 120మందికి పైగా వలస వచ్చారు. ఒక్కో గ్రూప్‌లో 14మంది మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మొత్తం 18మందితో వరి నాట్లు వేస్తున్నారు. పురుష కూలీలు ముందుగా వరి నారు తీసి మహిళలు నాటేసేందుకు వీలుగా పొలంలో సిద్ధంగా పెడుతున్నారు. ఉద యం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు నాట్లు వేస్తున్నారు. ఇందుకు గాను ఎకరానికి గుత్తగా ఐదు వేల రూపాయలు తీసుకుంటున్నారు. మహారాష్ట్ర నుంచి కూలీల రాకతో వరి నాట్లు త్వరగా పూర్తవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

వాల్మీకి ఆవాసం సేవలు అభినందనీయం

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్



పుస్తకాలు అందిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్, నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 29: విద్యార్థుల సంక్షేమానికి వాల్మీకీ ఆవాసం అందిస్తున్న సేవలు అభినందనీయమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ధరూర్ క్యాంపులో గల వాల్మీకి ఆవాసంలో పిల్లలకు పుస్తకాలను జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడారు. అన్ని దానాల్లో కన్నా విద్యాదానం గొప్పదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే చదువును వదిలిపెట్టకూడదన్నారు. పిల్లలంతా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మునుముందు వాల్మీకి ఆవాసం సంస్థకు ఎప్పుడు సహాయ సహకారాలను అందించడానికి ముందుంటామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం, భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రావు, మల్లేశం, శ్రీధర్, మదన్ మోహన్, చెట్‌పల్లి మోహన్, వెంకటేశ్వర్ రావు, ప్రణయ్, ప్రతాప్, భగవాన్, చరణ్, మనోజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో స్వల్పంగా కురిసిన వర్షం

జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం స్వల్పంగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 7.3 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా జగిత్యాలలో 10.5 మిల్లీ మీటర్లు, ఇబ్రహీం పట్నంలో 10.0 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా బుగ్గారంలో 5.5 మిల్లీ మీటర్ల, కొడిమ్యాల, వెల్లటూరులలో 5.6 మిల్లీ మీటర్లు వర్షం కురిసినట్లు రికార్డు నమోదైంది. కాగా జిల్లాలోని బీమారం, మేడిపల్లిలలో 9.2 మిల్లీ మీటర్లు, జగిత్యాల రూరల్ 8.9, మెట్‌పల్లి 8.2, కథలాపూర్ 8.1, రాయికల్ 7.9, పెగడపల్లి 7.6, కోరుట్ల 7.4, మల్యాల 6.5, మల్లాపూర్ 6.0, బీర్‌పూర్ 5.9, ధర్మపురి, గొల్లపల్లి, ఎండపల్లి 5.8, సారంగపూర్ 5.7మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు.

మరమ్మతు పనులు ప్రారంభం



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్, జూలై 29: రాయికల్ పట్టణంలోని రామాజీపేట రోడ్డులో గల బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఈ బ్రిడ్జి చెడిపోవడంతో మరమ్మతుల కోసం మున్సిపల్ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రారంభమైన మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, పీఆర్ ఏఈ ప్రసాద్ సోమవారం పరిశీలించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్, జూలై 29: రాయికల్ పట్టణ 5వ వార్డు మాజీ మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు నారాయణ సతీమణి ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు కుటుంబాన్ని సోమవారం పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవిఅచ్యుత్ రావు, కౌన్సిలర్లు వల్లకొండ మహేష్, తురగ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి



జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

రాయికల్, జూలై 29: గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణుగోపాల్ అన్నారు. రాయికల్ పట్టణ కేంద్రంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన పునర్నిర్మాణంలో భాగంగా ఎమ్మార్పీఎస్ గ్రామగ్రామాన బలోపేతం చేయాలన్నారు, ప్రతీ గ్రామంలో జెండా గద్దెలు నిర్మించి ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నక్క సతీష్ మాదిగ, కో కన్వీనర్ పోడేటి సునీల్, జిల్లా ప్రచార కార్యదర్శి కొల్లూరి సురేందర్, సీనియర్ నాయకులు బాపురపు నర్సన్న, పాలెపు బాలరాజు, పడిగెల నరసింహా, చిలుముల శ్రీనివాస్, పాలెపు గణేష్, మారంపెల్లి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

వేములవాడ టౌన్, జూలై 29: ప్రభుత్వం కళాకారుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని రాజన్న ఆలయ సమీపంలోని అంబేద్కర్ విగ్ర హం వద్ద నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గౌవర పెన్షన్ రూ. 25 వేలుతో పాటు ఇతర హామీలను వెంటనే అమలు పరుచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ బొజ్జ కనుకయ్య, పోశెట్టి, బొడ్డు నారాయణ, తాళ్లపల్లి నాగరాజు, గుమ్మడిర రాజేశం తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామం

- సీసీ రోడ్లులేక బురదమయంగా లింగంపేట
- చిన్న వర్షాలకే ఇళ్ల మధ్యలోకి చేరుతున్న వర్షం నీరు
- డ్రైనేజీలు, రోడ్లు వేయాలని కోరుతున్న ప్రజలు





లింగంపేటలో ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షం నీరు, ఎలుకబావి వాడలో బురదమయంగా మారిన రహదారి

జగిత్యాల టౌన్ జూలై 29: జగిత్యాల పట్టణానికి సమీపంలో ఉన్న లింగంపేట గ్రామం జగిత్యాల మున్సిపాలిటీలో వీలినమైనప్పటికీ అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షాలకే రహదారులు చిత్తడిగా మారడంతో వాహనదారులతో పాటు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో ఇళ్ల మధ్యకే వర్షం నీరు చేరడంతో దోమలు, ఈగలతో పాటు పాముల బెదదతో ప్రజలు భయబ్రాంతులకు గురువుతున్నారు.

● ఐదేళ్లుగా అభివృద్ధి కోసం ఎదురుచూపులు...

లింగంపేట గ్రామం ఐదేళ్ల క్రింతం జగిత్యాల మున్సిపాటిటీలో వీలినం కావడంతో ప్రస్తుతం 10వ వార్డు కింద మున్సిపల్ అధికారులు శానిటేషన్ సేవలు అందిస్తున్నారు. రైల్వేస్టేషన్ ఉండడంతో జగిత్యాల మున్సిపాలిటీలో 10వ వార్డుకు పేరు ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం జరుగడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జగిత్యాల మున్సిపాలిటీలో 48 వార్డులు ఉన్నప్పటికీ వీలిన గ్రామమైన 10వ వార్డులో అభివృద్ధికి మాత్రం అధికారులు నిధులు కేటాయించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. 10వ వార్డు అభివృద్ధిపై అధికారులు, నాయకులు పట్టించుకోకపోడంతో ఎక్కడ చూసినా రహదారులు బురదమయంగా మారుతున్నాయి. ఇటీవల ఓ సంఘ భవనం కోసం ప్రభుత్వం రెండు గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించింది.

దీంతో వారు భూమిని చదును చేసి మట్టిని పోయడంతో పాటు మురికి కాలువను పూడ్చివేయడంతో పాటు ఓ ప్రజాప్రతినిధి ప్రభుత్వ భూమి పక్కనే మట్టిని ఎత్తుగా పోయడంతో వర్షం నీరు ఇళ్ల మధ్యనే నిలిచి రాకపోకలకు ఇబ్బందులుగా మారాయి. అధికారుల దృష్టికి నాయకులు సమస్యను తీసుకవెళ్లినా సమస్య నేటికి పరిష్కారం కాకపోవడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2,500 పైగా జనాభా, 1500 పైగా ఓటర్లు ఉన్నప్పటికీ కేవలం నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే 10 వ వార్డులో పర్యటిస్తున్నారే తప్పా అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

తురక రాజిరెడ్డి, రైతు నాయకుడు, లింగంపేట



10వ వార్డు సమస్యలపై అధికారులు, నాయకులు దృష్టి సారించాలి. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారితో పాటు ఎలుకబావి తదితర ప్రాంతాల్లో మట్టిరోడ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. చిన్న వర్షాలకే ఇళ్ల మధ్యలోకి నీరు చేరుతుంది. మున్సిపల్ అధికారులు తక్షణమే వార్డు సమస్యలపై దృష్టి సారించాలి.

గురుకులంలో మౌలిక వసతులు కల్పించాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్



వివరాలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్

మెట్‌పల్లి రూరల్, జూలై 29: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్ కోరారు. సోమవారం గురుకులం సందర్శించి పాఠశాలలో ఇటీవల మృతి చెందిన విద్యార్థి గణాధిత్య, అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న రాపర్తి హర్ష, అడెపు గణేష్ వివరాలను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన ఘటనపై గురించి కలెక్టర్‌తో ఫోన్‌లో చర్చించి అస్వస్థతతో బాధపడుతున్న విద్యార్థులకు మెరుగైన చికిత్స అందిచాలని, మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, సురభి అశోక్, రైస్, తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి, జూలై 29: ధర్మపురి మండలంలోని జైనా గ్రామానికి చెందిన ఏకబోతే నాగార్జున రెండు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సోమవారం ఆయనకు అప్పగించారు. రెండు నెలల క్రితం నాగార్జున తన మొబైల్ రెడ్ మి నోట్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ తెలుసుకుని ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు నాగార్జున ఎస్ఐ ఉదయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, జూలై 29: బిల్డింగ్ కమిటీ మెంబర్, హైకోర్టు న్యాయమూర్తి బి. విజయ్‌సేన్ రెడ్డిని సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం హై కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిరిసిల్లలోని పాత కోర్టు సముదాయంలో రూ.10 కోట్ల బిల్డింగ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని చెప్పారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటి , కోశాధికారి బిట్ల విష్ణు, సీనియర్ న్యాయవాది భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 29: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 31న పాఠశాలల్లో వంట బంద్ చేయనున్నట్లు చెప్పారు. 22 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం చేస్తున్న కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సొంత డబ్బులతోపాటు వంటలు చేయడానికి అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల



కవర్లు కప్పి ఉన్న వెల్దుర్తి పశు వైద్యశాల

జగిత్యాలరూరల్, జూలై 29: మండలంలోని వెల్దుర్తి పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితికి చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు పశువైద్యశాల నిర్వహిస్తున్న భవనం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరి పెను ప్రమాదం పొంచి ఉంది. భవనం పైనుంచి నీరుకారుతుండంతో విషయం తెలుసుకున్న గ్రామ రైతులు సొంతంగా కవర్లు కొనుగోలు చేసి భవనానికి రక్షణగా అమర్చారు. 50 ఏళ్ల కిందట గ్రామంలో పశువుల వైద్యం కోసం ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టారు. భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామంలోని పశువుల వైద్యసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెల్దుర్తి కేంద్రంగా ఐదు గ్రామాలకు వైద్యసేవలు అందించడానికి భవనం నిర్మించగా, ప్రస్తుతం శిథిలావస్థకు

పట్టించుకోని పాలకులు, అధికారులు

చేరడంతో వైద్యసేవలకు అంతరాయం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు జిల్లా కేంద్రంలోని పశువుల ధవాఖానాకు వెళ్లి వైద్యం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా అధికారులు, ప్రభుత్వం నిధులు కేటాయించడంలేదని గ్రామస్థులు, రైతులు తీవ్ర అసహనం చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన ఆస్పత్రి భవనం నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

భవన నిర్మాణం చేపట్టాలి

బొక్కల కిషన్, రైతు వెల్దుర్తి



జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి కేంద్రంగా ఐదు గ్రామాలకు పశువైద్యసేవలు అందించడం కోసం 50 ఏళ్ల కిందట పశు వైద్యశాల నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పెను ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడుకూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్యసేవలకు అంతరాయం ఏర్పడి ఐదు గ్రామాల రైతులు ఇబ్బందిపడుతున్నారు. వర్షాలకు భవనం పైభాగం దెబ్బతిని పైనుంచి నీరు లీకేజీ అవుతోంది. రైతులంతా స్వచ్ఛందగా కవర్లు కొనుగోలు చేసి తాత్కాలికంగా భవనానికి పాలిథిన్ కవర్లు అమర్చాం. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన పశు వైద్యశాల నిర్మాణం చేపట్టాలి.

బేటీ బచావో కాదు... కూటమి బచావో బడ్జెట్

- ఐద్వా జాతీయ నాయకురాలు టి జ్యోతి

భగత్‌నగర్, జూలై 29: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బేటీ బచావో బడ్జెట్ కాదని, ఎన్‌డీఏ కూటమి బచావో బడ్జెట్ అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నాయకురాలు టి జ్యోతి అన్నారు. సోమవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మహిళల్ని పూర్తిగా విస్మరించారన్నారు. బేటి బచావో అని చెబుతున్న కేంద్రం కుర్చీ బచావో అనే విధంగా బడ్జెట్ కేటాయించారన్నారు. మహిళల అభ్యున్నతికి ఉద్యోగ కల్పన, కుటీర పరిశ్రమలకు నిధులు కేటాయించడక పోవడం మహిళల్ని అవమానించడమే అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై వేధింపులు అధికంగా ఉన్నాయన్నారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించినా ప్రధాని నరేంద్ర మోదీ నోరు మెదపలేదన్నారు. హత్రాస్, కధువా, ఉన్నావ్ లాంటి ఘటనల్లో బీజేపీ నాయకులే దుండగులకు కొమ్ముకాసే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. మహిళలకు రూ. 2500, మహిళా గ్రూప్‌లో 20 లక్షల వడ్డీ లేని రుణాలు, కొత్తగా అర్హత ఉన్న వారికి రేషన్‌కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేయాలన్నారు. రాజకీయ శిక్షణ తరగతుల్లో మహిళలని చైతన్యపరిచి రానున్న రోజుల్లో మహిళా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు కెఎన్ ఆశాలత, మాగర్ల భారతి, సహాయ కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ఎన్ రత్నమాల, కె గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

- ● వర్షాలతో బావుల్లోకి చేరుతున్న నీరు
- ● ఆనందంలో అన్నదాతలు
- ● వ్యవసాయ పనుల్లో బిజీగా రైతన్నలు



నాటు వేస్తున్న మహిళా కూలీలు



ఒడ్డు పెడుతున్న రైతు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

వెల్గటూర్, జూలై 29: పది రోజులుగా వర్షాలకు వెల్గటూర్ ఉమ్మడి మండలంలో వరి సాగు పనులు జోరందుకున్నాయి. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలకు సరిపడా నీరు అందుతోంది. చెరువులు, కుంటలు, బావుల్లోకి నీరు చేరుతోంది. దీనితో ఇప్పటికే నారు పోసుకున్న రైతులు పొలం దున్ని నాట్లు వేస్తున్నారు. నిత్యం వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీగా గడుపుతున్నారు. రైతులు ఓ వైపు వరి పొలాలు సిద్ధం చేసుకుంటూనే మరో వైపు మెట్ట పంటలకు ఎరువులు వేస్తూ బిజీగా ఉంటున్నారు.

● 30 వేల ఎకరాల్లో సాగు అంచనా..

ఉమ్మడి వెల్గటూర్ మండలంలో 30 వేల ఎకరాలు వ్యవసాయ భూమి సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో 28 వేల ఎకరాలు సాగు కాగా 21 వేల ఎకరాల వరి, 4 వేల ఎకరాలు పత్తి, 3 వేల ఎకరాలు మిగతా పంటలు సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ సీజన్‌లో 30 వేల ఎకరాలు సాగు అంచనా వేస్తున్నారు. ఇందులో 22 వేల ఎకరాల వరకు వరి సాగు అంచనా కాగా ఇప్పటి వరకు సుమారు 12 వేల ఎకరాలు వరి సాగు, 4 వేల ఎకరాలు పత్తి సాగు చేశారు.

● కుంటలు, చెరువుల్లోకి చేరుతున్న నీరు

పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు బావులు, కుంటలు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. వరి సాగుకు సరిపడా నీరు పొలాలకు చేరుతుండడంతో అన్నదాతలు ఆనందంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. రైతుల్లో సాగు పై ఆశలు పెరిగాయి. దీనితో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు. రైతులు అందరూ ఒకే సారి నాటుకు సిద్ధం చేస్తుండడంతో మహిళ కూలీల కొరత ఏర్పడుతోంది.